తేనె లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణ మహోత్సవం



స్వామి వారి ఆలయంలో పూజలు చేస్తున్న స్థానికులు, ఆలయ నిర్వాహకులు



ఉప్పల్: ఉప్పల్ బీరప్పగడ్డ తేనె లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే ప్రారంభమైన ఉత్సవాల్లో స్థానిక ప్రజలు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. గోపు ఆనంద్, పిట్ల శ్రీనివాస్, సామల నాగరాజు, మాడిశెట్టి సత్యనారాయణ, కామెడి ఇంద్రసేనారెడ్డి, మల్లిపల్లి జగన్, మహేందర్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

భవన్స్‌లో నూతన కోర్సులు



భవన్స్ వివేకానంద కాలేజీలో విడుదల చేసిన నివేదిక

అల్వాల్: నేరెడ్‌మెట్ సైనిక్‌పురిలోని భవన్స్ వివేకానంద కాలేజీలో నూతన కోర్సులు అందుబాటులో ఉంటాయని కాలేజీ నిర్వాహకులు తెలిపారు. కాలేజీ ఆవరణలో పత్రిక ప్రసార మాధ్యమాల కమిటీ నివేదిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కాలేజీలో విద్యార్థులకు ఉన్న వసతులు, గత సంవత్సరం ఉత్తీర్ణతశాతం, ఉచిత నైపుణ్య శిక్షణ తరగతులు, బీకాంలో నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సుల వివరాలతో కూడిన నివేదికను విడుదల చేశారు. కార్యక్రమంలో పలు ప్రసార మాధ్యమాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణ



కాంగ్రెస్‌లో చేరుతున్న కార్పొరేటర్ జక్క పద్మ దంపతులు

బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల పట్ల ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ బీఆర్‌ఎస్ కార్పొరేటర్ జక్క పద్మ దంపతులు బుధవారం ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి తీసుకొచ్చిన ఆరు గ్యారెంటీలపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేసి వాటి ఫలాలను అర్హులైన వారికి అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, బొమ్మక్ సుగుణ బాలయ్య, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొత్త సుశాంత్‌గౌడ్, నాయకులు పోగుల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటి కోసం.. చిన్నారి విన్యాసాలు



రామంతాపూర్: పుస్తకాలు పట్టుకొని బడికి వెళ్లాల్సిన బాలిక పేద కుటుంబంలో పుట్టడంతో పేదరికంలో మగ్గుతున్న కుటుంబం కడుపు నింపడానికి ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తోంది. ఎంతో ఎత్తులో అటూ ఇటూ కట్టిన సన్నని తాడుపై అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటూ తిరుగుతూ ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తూ ఉంది. పొరపాటున పట్టుజారి కింద పడితే ప్రాణాపాయమే. ఈ దృశ్యం మంగళవారం రాత్రి రామంతాపూర్ కామాక్షిపురంలో కనిపించింది.

ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి

సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ 136 వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జి. వినోద్ కుమార్,క లెక్టరేట్‌లో వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్ర సభ స్థాపకుడు భాగ్యరెడ్డి వర్మ గొప్ప సంఘసంస్కర్త అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలతో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది ఘన నివాళులర్పించారు.

నీటి నమూనాలు సేకరించిన అధికారులు



ఘట్‌కేసర్: ఏదులాబాద్ చెరువులో కలుషిత నీరు చేరి చేపలు మరణించిన ఘటనపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించారు. బుధవారం కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ శరత్‌చంద్ర, అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ మహేశ్‌ల బృందం ఏదులాబాద్ చెరువును సందర్శించి చెరువులోని నీటి నమూనాలు సేకరించారు. నీటిని పరిశీలనలు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఏదులాబాద్ చెరువులో కాలుష్య నివారణకు కాలుష్య నియంత్రణ మండలి వీలైనంత త్వరగా కార్యాచరణ రూపొందించాలని, కాలుష్యాన్ని అరికట్టాలని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి కోరారు. అధికారుల బృందంతో కలిసి నీటిని పరిశీలించారు. పరిశీలనలో మాజీ సర్పంచ్ శంకర్, వార్డు సభ్యులు సురేశ్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు యాదగిరి, గంగపుత్రులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో భయం భయం

శిథిలావస్థలో చిలకలగూడ ఠాణా

- పెచ్చులూడుతున్న పైకప్పులు
- బీటలువారుతున్న గోడలు
- భయం గుప్పిట్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది
- ప్రతిపాదనలకు పరిమితమైన నూతన భవన నిర్మాణం





పిల్లర్లకు పగుళ్లు వచ్చిన దృశ్యం

చిలకలగూడ: ఈస్ట్‌జోన్ పరిధిలోని చిలకలగూడ ఠాణా భవనం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. సెల్లార్‌తో పాటు పిల్లర్లు, స్లాబులు, కిటికీలు పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందోనని భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. వెలిసిపోయిన రంగులతో బయట నుంచి చూస్తే భూత్ బంగ్లా తలపిస్తోంది. శిథిలా భవనాన్ని తక్షణమే ఖాళీ చేయాలని సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ ప్రత్యామ్నాయం లేకపోవడంతో అదే భవనంలో ఠాణా కొనసాగడం గమనార్హం . సీఐ, ఎస్‌ఐలు, వందకు పైగా సిబ్బంది ఠాణాలో విధులు నిర్వహిస్తుంటారు. ఫిర్యాదుదారులతో పాటు వివిధ కారణాలు, సమస్యలతో ఠాణాకు వచ్చేవారు మరో రెండు వందల మంది ఉంటారు. ప్రమాదం సంభవిస్తే తీవ్రమైన ప్రాణ నష్టం జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. అనునిత్యం బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వహిస్తున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఏ క్షణం ఏమి జరుగుతుందోననే భయంతో తాను ఇటీవలే జీవితబీమా పాలసీ (ఇన్స్యూ చేయించుకున్నానని ఓ హోంగార్డు చెప్పడం ఇక్కడ విధులు నిర్వహించే సిబ్బంది భయాందోళనకు పరాకాష్టగా చెప్పుకోవచ్చు.

శిథిలావస్థకు కారణాలివే..

మూడు దశాబ్దాలే అయినప్పటికీ శిథిలావస్థకు చేరడంలో పలు అంశాలు దోహదపడినట్లు ఇంజినీరింగ్, నిర్మాణ రంగ నిపుణులు భావిస్తున్నారు. పూడుకుపోయిన చెరువు స్థలంలో ఠాణా భవనం నిర్మించడం, భవనానికి ఆనుకుని నాలా ప్రవహించడం, వరదనీరు నాలాలోకే చేరడం, సాయిల్ టెస్ట్ ప్రక్రియ చేపట్టకుండానే భవనాన్ని నిర్మించడంతో భూమి నుంచి ఉత్పత్తి అయిన కాలుష్యంతో పిల్లరు దృఢత్వాన్ని కోల్పోయినట్లు నిపుణుల పరిశీలనలో స్పష్టమైంది.

పదేళ్ల క్రితం పైపై మెరుగులు..

రహదారిలో రాఘవేంద్ర టిఫిన్స్‌కు ఎదురుగా 1981లో ఏర్పాటు చేసిన ఠాణా భవనం చిన్నదిగా ఉండడంతో మూడు దశాబ్దాల క్రితం శ్రీదేవి థియేటర్ సమీపంలో 400 గజాల స్థలంలో రెండస్తుల్లో భవనాన్ని నిర్మించారు. ఇప్పటి వరకు 28 మంది స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌ఓ)లు ఇక్కడ పనిచేశారు. తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో లక్షలాది రూపాయల వ్యయంతో శిథిలావస్థకు చేరిన భవనానికి పైపై మెరుగులు దిద్దారు.



బీటలు వారి ఇలా..

2015 అక్టోబర్ 16 తేదీన రెనోవేటెడ్ బిల్డింగ్‌ను అప్పటి సీపీ మహేందర్‌రెడ్డి, అడిషనల్ సీపీ అంజనీకుమార్ ప్రారంభించారు.

ప్రమాదం జరగక ముందే స్పందించాలి..

భవన నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. ఖాళీగా ఉన్న చిలకలగూడ మున్సిపల్ మైదానంలోని కొంతభాగంలో నూతన ఠాణా భవన నిర్మాణానికి కొంత మేర కృషి జరిగింది. జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ శాఖల నుంచి అవసరమైన అనుమతులు లభించకపోవడంతో ప్రతిపాదనలు బుట్టదాఖలాలు అయ్యాయి. త్వరలో వర్షాకాలం ప్రారంభం అవుతోంది. గోడలు తడిసి కూలిపోయే ప్రమాదం ఉంది. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనం ప్రమాదం జరగక ముందే అప్రమత్తమవ్వాలని స్థానికులతో పాటు పోలీస్ సిబ్బంది కోరుతున్నారు.

ఘనంగా సుదర్శన హోమం, కల్యాణం





గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ జేఎల్‌ఎస్‌నగర్‌లోని జయగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం ప్రధాన అర్చకులు రఘుకిరణాచార్యులు సుదర్శన హోమం, లక్ష్మీ నర్సింహ స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో రమాదేవి, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా నాగవల్లి బోనాలు

కొనసాగుతున్న బీరప్పస్వామి కల్యాణ మహోత్సవం



నాగవల్లి బోనాలు, బోగన్న వేషాలతో దేవాలయానికి వస్తూ..

మల్లాపూర్: బీరప్పస్వామి కామరాతి కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆరవ రోజు బీరప్పస్వామి, కామరాతి దేవి, అక్క మహంకాళమ్మ బోగన్న వేషాలతో నాగవల్లి కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అక్కమహం కాళమ్మ, కామరాతి దేవికి ఒడి బియ్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఓయూ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీనారాయణ, ఓయూ ఎగ్జామ్ కంట్రోలర్ రాములు, ఫౌండర్ గట్టయ్య, అధ్యక్షులు బెల్ల బక్కయ్య, చైర్మన్ హమాలీ శ్రీను, ప్రధాన కార్యదర్శి చౌదరిపల్లి పర్వతాలు, వైస్ చైర్మన్ సీతాల వీరాస్వామి, బొడ్డు నాగమల్లయ్య, సంయుక్త కార్యదర్శి వస్పరి శ్రీనివాస్, భూమండ్ల శ్రీనివాస్, వీరేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్యం కోసం అన్ని జాగ్రత్తలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఆర్టీసీ ఉద్యోగి

బోడుప్పల్: ఆర్టీసీ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అన్ని విధాలుగా జాగ్రత్తలు తీసుకుంటోందని చెంగిచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత అన్నారు. చెంగిచర్ల ఆర్టీసీ డిపోలో బుధవారం టీజీఎస్ ఆర్టీసీ గ్రాండ్ హెల్త్ చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగుల కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు ఆరోగ్యవంతంగా ఉండి విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. వైద్య శిబిరంలో ఆర్టీసీ ఉద్యోగులకు బీపీ, షుగర్, రక్త, ఈసీజీ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈసీజీలు, బీపీ ఎక్కువ ఉన్న వారిని తార్నాకలోని టీజీఎస్ ఆర్టీసీ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీధర్, అసిస్టెంట్ మేనేజర్లు ఆనందరావు, సుబ్రహ్మణ్యం , సూపరింటెండెంట్ రత్నమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ బీఆర్‌పీ లక్ష్మి పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు పూర్తయిన తర్వాత రోడ్డు పనులు



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్ కాలనీలో రూ.10 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పనులను బుధవారం నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గతంలో డ్రైనేజీ పనుల కోసం రూ.10 లక్షలు మంజూరైనా కాంట్రాక్ట్ పనులు చేయడానికి ముందుకు రాలేదన్నారు. డ్రైనేజీ పనులు పూర్తయిన తర్వాత సీసీ రోడ్డు పనులను పూర్తి చేయిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. డివిజన్ పరిధిలో అవసరమైన చోట భూగర్భ డ్రైనేజీలను వేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ నాయకులు సాయిజెన్‌శేఖర్, నాచారం డివిజన్ అధ్యక్షులు మేకల ముత్యంరెడ్డి, వేముల మారయ్య, ప్రీతిరెడ్డి, రాజాబాబు, పెంటయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం సాల్వ్ ఫర్ టుమారో..

సాక్షి, సిటీబ్యూరో: పాఠశాల విద్యార్థుల కోసం సంక్లిష్టతలను పరిష్కరించే సామర్థ్యంతో పాటు, ఇతరత్రా స్కిల్స్‌ను అందించేందుకు ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల బ్రాండ్ శామ్‌సంగ్.. సాల్వ్ ఫర్ టుమారో పేరిట పలు విద్యా సంబంధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా పాఠశాల విద్యార్థులకు డిజైన్ థింకింగ్ వర్క్‌షాప్స్ ఏర్పాటు, కమ్యూనిటీ ఛాంపియన్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు ఉపయుక్తమైన వస్తువులతో పాటు పాఠశాలకు రూ.25 లక్షల వరకూ గ్రాంట్ అందించనున్నట్లు వివరించారు.


బిట్స్ పిలానీలో వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్

జవహర్‌నగర్: బిట్స్ పిలానీ క్యాంపస్‌లో వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్ ఎంటెక్, ఎంబీఏ, ఎమ్మెస్సీ, బీటెక్‌లో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని బిట్స్ పిలానీ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆధునిక వ్యాపారాలు ఉత్పత్తులు, డిజిటల్ సాంకేతికతలను అందిపుచ్చుకునేందుకు వర్క్ ఇంటిగ్రేటెడ్ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ నెల 22 నుంచి జూన్ 17 వరకు అడ్మిషన్లు జరుగుతాయని, ఆసక్తి గల ప్రొఫెషన ల్స్ బిట్స్ పిలానీ క్యాంపస్‌లో సంప్రదించాలని కోరారు.

వర్షాకాలానికి ముందస్తు చర్యలు చేపట్టాలి

జవహర్‌నగర్: వర్షాకాలనికి ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను జవహర్‌నగర్ కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాబోయేది వర్షాకాలమని లోతట్టు ప్రాంతాలలో ఇండ్లను ఇప్పుడే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. విధుల్లో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే సహించేదిలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు సత్వర పనులు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఈ మాదవచారి, ఏఈ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీదేవి, ఎల్లమ్మ, రజనీ, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయి, తిరుపతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



జవహర్‌నగర్: సర్కారు జాగాను కబ్జా చేస్తే సహించేదిలేదని కాప్రా తహసీల్దార్ సుచరిత హెచ్చరించారు. జవహర్‌నగర్‌లోని అరుంధతినగర్ ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన ఇండ్లను, గుడిసెలను బుధవారం జేసీబీ సహాయంతో పోలీసుల బందోబస్తు నడుమ కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుచరిత మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని ప్రయత్నిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోబోమని అటువంటి వారిని గుర్తించి పీడీయాక్ట్‌లు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే చాలా మందిపై కేసులు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. సీఐ నాగరాజు, అడ్మిన్ ఎస్‌ఐ ఇద్రీస్ అలీ, ఎస్‌ఐలు అనిల్‌కుమార్‌యాదవ్, అనిల్‌రెడ్డి, కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, డిప్యూటి తహసీల్దార్ రాధిక, ఆర్‌ఐ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ మంజూరు



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేసిన మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ శ్రీకృష్ణనగర్ ప్రాంతానికి చెందిన సఫ్వాన్ సబేర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేయగా రూ.1.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. ఎల్‌ఓసీని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, నాయకులు రాంయాదవ్, వెంకన్న, మణిరత్నం తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుల కారణంగా కరెంటు కోతలు

ఉప్పల్: హబ్సిగూడ వీధి నంబర్-8 11కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు గ్రీన్‌హిల్స్ కాలనీ, బృందావన్ కాలనీ, వసంత్ విహార్ కాలనీ, వీవీ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ రామిరెడ్డి తెలిపారు. ఐఎస్‌ఐ ఫీడర్ వీధి నంబర్-8 సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 12.45 నుంచి 2.15 నిమిషాల వరకు జేఎస్‌ఎన్ కాలనీ, వీవీ నగర్, గాంధీ గిరిజన బస్తీ, రవీంద్రానగర్ రోడ్ నంబర్-6 నుంచి 27 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. 11 కేవీ సైంటిస్టు కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఎన్‌జీఆర్‌ఐ సబ్‌స్టేషన్ పరిధిలో 3 గంటల నుంచి 4.30 వరకు సైంటిస్టు కాలనీ, జహీర్‌నగర్, సాయిఎన్‌క్లేవ్, ఎన్‌జీఆర్ సబ్‌స్టేషన్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఐఐసిటి క్వార్టర్స్, సీసీఎంబీ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

మరమ్మతుల కారణంగా..

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బోడుప్పల్‌లోని పలు కాలనీల్లో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. అయ్యప్ప టెంపుల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు ఈస్ట్ బాలాజీహిల్స్, బాలాజీహిల్స్, వెస్ట్ బాలాజీహిల్స్, పద్మావతి కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే మల్లిఖార్జున్ నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు మల్లిఖార్జున్‌నగర్, న్యూరాంనగర్, కుమ్మరికుంట, చిలుకానగర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బోడుప్పల్‌లో..

ఆంజనేయనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ద్వారకానగర్ ఫేస్ 1, 2, శ్రీనివాస్‌కాలనీ, ఆంజనేయనగర్, బుడగ జంగాల కాలనీ, గాయత్రీ నగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు భవానీకాలనీ, యాదవబస్తీ, మనసాని కాలనీ, మారుతీనగర్, ఎస్‌బీఆర్ కాలనీ, టెలిఫోన్ కాలనీ, మణికంఠనగర్, శుభోదయ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మైలారం స్వామి ఒక ప్రకటనలో వెల్లడించారు.

పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో..

మేడిపల్లి: 11కేవీ ఎస్‌ఐఎస్ ఫీడర్ 33/11కేవి పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల కటింగ్ కారణంగా గురువారం ఎస్‌ఐఎస్ 11కేవీ ఫీడర్ పరిధిలోఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారి తెలిపారు. పీఅండ్‌టీ కాలనీ లేన్ 10, 11, బుద్దానగర్, యంకెనగర్ కాలనీల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. 33/11కేవీ కెనరా నగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల కటింగ్ కారణంగా గురువారం 11కేవీ కెనరా నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ హరినాథ్ తెలిపారు. పీఅండ్‌టీ కాలనీ రోడ్డు నంబర్ 1, 2, మెయిన్ రోడ్డు (హైదరాబాద్ టూ వరంగల్ హైవే) బుద్దానగర్ ప్రాంతాల్లో కరెంటు నిలిపివేస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.

ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో..

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ బాలసరస్వతీనగర్, శివపురి కాలనీ ఫీడర్ల పరిధిలో గురువారం మరమ్మతులు జరుగుతాయని అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 రాజీవ్‌గాంధీనగర్, విష్ణుపురి ఎక్స్‌టెన్షన్, విమలాదేవినగర్, శివపురి కాలనీ పరిధిలో, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శివపురికాలనీ, విష్ణుపురి, నల్లపోచమ్మ దేవాలయం పరిసరాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మల్లాపూర్‌లో...

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని నోమా ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు గోకుల్‌నగర్, చాణిక్యపురికాలనీ, సుభాష్‌నగర్, దత్తాత్రేయనగర్, శక్తిసాయినగర్, బాబానగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. అదేవిధంగా మల్లాపూర్ విలేజ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మల్లాపూర్ విలేజ్, బ్రహ్మపురి కాలనీ, గ్రీన్‌హిల్స్‌కాలనీ, ఎస్వీనగర్, న్యూ నర్సింహనగర్ కాలనీలో కరెంటు సరఫరా ఉండదన్నారు.

నాచారంలో..

నాచారం 11 కేవీ కార్తీకేయనగర్ ఫీడర్ పరిధిలోని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కార్తీకేయనగర్, వీరారెడ్డి నగర్, మెయిన్ రోడ్, వైజయంతి ఫీడర్ పరిధిలో కౌండిన్యనగర్, వైజయంతి థియేటర్ ప్రధాన రహదారి, రవీంద్రనగర్, సాయినగర్ కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ నాగరాజు తెలిపారు. స్టాలిన్ టైర్ ఫీడర్ పరిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు రోడ్ నంబర్ 5, 6, 8 ఐడీఐ నాచారం , అవురా ఫీడర్ పరిధిలో రోడ్ నంబర్ 6, మల్లాపూర్ నుంచి నాచారం ఐడీఏ ప్రధాన రహదారిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.


పాలిసెట్ ఎంట్రన్స్‌కు ఏర్పాట్లు పూర్తి



వినయ్‌కుమార్, మేడ్చల్ జిల్లా పాలీసెట్ కో ఆర్డినేటర్

రామంతాపూర్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలోని ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల కోసం ఈ నెల 24న శుక్రవారం నిర్వహించే పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్) ప్రవేశ పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మేడ్చల్ జిల్లా పాలిసెట్ కో ఆర్డినేటర్ రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించే ఈ పరీక్షకు ఉప్పల్ నియోజకవర్గంలోని విద్యార్థుల కోసం ఈ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పరీక్ష కేంద్రాలు ఇవి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రామంతాపూర్, మెగా ఉమెన్స్ డిగ్రీ కళాశాల పెద్ద చెరువు ఎదురుగా రామంతాపూర్, స్ఫూర్తి మహిళా డిగ్రీ కళాశాల లక్ష్మీనగర్, రామంతాపూర్, ప్రిన్స్‌టన్ డిగ్రీ కళాశాల శారదానగర్ రామంతాపూర్, ప్రిన్సిటన్ పీజీ కళాశాల శారదా నగర్, రామంతాపూర్, వాగ్దేవి మహిళా డిగ్రీ కళాశాల డిమార్ట్ వెనుక రామంతాపూర్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని అభ్యర్థులు ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలని ఆయన సూచించారు. మొత్తం ఆరు పరీక్షా కేంద్రాల్లో 2,908 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వైభవంగా బాలాజీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం



శామీర్‌పేట్: అంగరంగ వైభవంగా శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం బుధవారం నిర్వహించారు. మూడుచింతలపల్లి మండలం, కేశవరం గ్రామంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 4 గంటలకు రథోత్సవం నిర్వహించారు. గ్రామంలోని వీధుల స్వామి వారి నామస్మరణలతో మార్మోగాయి. గ్రామ పెద్దలు, యువకులు రథోత్సవంలో పాల్గొన్నారు.